క్లుప్తంగా

ఐటీఐలో మిగులు సీట్లకు 4న కౌన్సెలింగ్

గుమ్మలక్ష్మీపురం: భద్రగిరి ప్రభుత్వ ఆర్‌ఐటీఐలో మిగులు సీట్లలో ప్రవేశాలకు ఈనెల 4న రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ సునీల్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 3వ తేదీనే కౌన్సెలింగ్ నిర్వహించాల్సి ఉన్నప్పటికీ ఆదివాసీ సంఘాలు అదే రోజు మన్యం బంద్‌కు పిలుపునివ్వడంతో 4వ తేదీకి కౌన్సెలింగ్‌ను వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు ఈ విషయాన్ని గమనించి 4వ తేదీన కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని కోరారు.

కొండాపురం విద్యార్థిని ప్రతిభ


మాకెన స్నిగ్ధప్రణవ

పాలకొండ: ఇంటర్నేషనల్ ప్రోగ్రాం ఇన్ మేనేజ్‌మెంట్ (ఐపీఎం) నిర్వహించిన పరీక్షల్లో మండలంలోని కొండాపురం గ్రామానికి చెందిన మాకెన స్నిగ్ధ ప్రణవ ప్రతిభ కనబరించింది. ఈ ఏడాది జూన్‌లో నిర్వహించిన ఈ పరీక్ష ఫలితాలను మంగళవారం విడుదల చేశారు. అందులో ఆమె మంచి ర్యాంకు సాధించడంతో పాటు ఐఐఎం రాంచీలో సీటు పొందింది. స్నిగ్ధప్రణవ తండ్రి, వ్యక్తిత్వ వికాసనిపుణుడు మాకెన సతీష్, తల్లి శిరీష తమ కుమార్తెకు జాతీయ స్థాయి విశ్వవిద్యాలయంలో సీటు రావడంపై ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వాహన తనిఖీలు

పాలకొండ రూరల్: పాలకొండ-సీతంపేట, వీరఘట్టం రహదారిలో పోలీసులు మంగళవారం వాహన తనిఖీలు చేపట్టారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న నలుగురితో పాటు బహిరంగంగా మద్యపానం చేస్తున్న మరో ముగ్గురుపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై బి.శివప్రసాద్ తెలిపారు. డ్రైవింగ్ లైసెన్సు, వాహన ధ్రువపత్రాలు లేని వాహన చోదకులపై అపరాధ రుసుం విధించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు.

ముమ్మరంగా దమ్ములు


ఆర్తాంలో వరినాట్లుకు సిద్ధం చేసిన దమ్ముమడి

కొమరాడ: మండలంలో వర్షాలు విస్తారంగా కురవడంతో పలు గ్రామాల్లో ఖరీఫ్ దమ్ములు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. జంఝావతి ఎడమ కాలువ ద్వారా సాగునీరు రావడంతో ఆర్తాం, గంగారేగువలస, విక్రంపురం, పరుశురాంపురం, చంద్రపీఠ తదితర గ్రామాల్లో ఉభాలు 80శాతం వరకు పూర్తయ్యాయి. మరోవైపు జంఝావతి ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు విడిచి పెట్టాలని రాజ్యలక్ష్మీపురం, కందివలస, కుమ్మరిగుంట రైతులు కోరుతున్నారు.

ఓటరు నమోదుకు సహకరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ

పార్వతీపురం: ఓటరు నమోదు కార్యక్రమానికి సహకరించాలని పార్వతీపురం ఓటరు నమోదు అధికారి, రెవెన్యూ డివిజనల్ అధికారి కె.హేమలత పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం ఆమె వివిధ రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ఇంటింటికీ ఓటరు ధ్రువీకరణ కార్యక్రమం జూలై 21 నుంచి జరుగుతోందని తెలిపారు. 10 కంటే ఎక్కువ ఫారాలను బీఎల్ఓకు సమర్పించకూడదనే షరతులకు లోబడి ఎన్నికల సంఘం బూత్ లెవెల్ ఏజెంట్లను అనుమతించిందని చెప్పారు. బూత్ లెవల్ ఏజెంట్లు సమర్పించిన దరఖాస్తులన్నింటికీ ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలని స్పష్టం చేశారు. డూప్లికేట్ ఎంట్రీలు, చనిపోయిన ఓటర్లు, శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్ల వివరాల పరిశీలన, ఓటర్ల జాబితాలో సవరణలు ఉంటే గుర్తిస్తారని పేర్కొన్నారు. చిరునామా మార్చుకున్న ఓటర్ల వివరాలు, డోర్ నంబర్ అడ్రస్ వెరిఫికేషన్ (10 కంటే ఎక్కువ ఓటర్లు ఉన్న ఇళ్లు) చేస్తారని చెప్పారు. ముసాయిదా ఓటరు జాబితా అక్టోబరు 27న ప్రచురిస్తామని, అక్టోబరు 17 నుంచి నవంబరు 30 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌లు సమర్పించవచ్చని చెప్పారు. సమావేశంలో తహసీల్దార్లు, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

55 శాతం రాయితీపై పైపులు

సీతానగరం: మండలంలోని వ్యవసాయ భూములకు అవసరమైన నల్ల పైపులు రాయితీపై పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని ఏఓ ఎస్.అవినాష్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ వ్యవసాయం చేస్తున్న చిన్న, సన్నకారు రైతులు, 5 ఎకరాల భూమి కలిగిన వారికి ప్రభుత్వం రాయితీపై ఏపీఎంఐపీ, జైన్ కంపెనీలకు చెందిన 30, పైపులు, 5 స్ప్రింక్లర్లు 55 శాతం రాయితీపై పొందవచ్చని చెప్పారు.


వీరఘట్టం: కత్తులకవిటిలో వృద్ధుడికి పింఛన్ అందజేస్తున్న వలంటీరు భవానీ


వీరఘట్టం: గంగమ్మపేటలో వృద్ధుడికి పింఛన్ అందజేస్తున్న వలంటీరు శ్రీదేవి


వీరఘట్టం: రాజుగారివీధిలో వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న వలంటీరు రాము


పాలకొండ: సింగన్నవలసలో పింఛన్లు అందిస్తున్న వలంటీరు


గుమ్మలక్ష్మీపురం: పార్వతీపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుడు బందారు మునికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ బొత్తాడ నీలవేణి

చకచకా పింఛన్ల పంపిణీ

ప్రతీ నెల ఒకటో తేదీనే వలంటీర్ల ద్వారా పింఛన్ డబ్బులను ప్రభుత్వం ఇంటికి పంపిస్తుండడంతో అవ్వాతాతల ముఖాల్లో ఆనందం కనిపిస్తోంది. ఆగస్టు నెల పింఛన్ డబ్బులను మంగళవారం వలంటీర్లు పంపిణీ చేశారు. ఉదయం నుంచి వర్షం కురుస్తున్నా.. వలంటీర్లు లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి పింఛన్లు అందజేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో పింఛన్ కోసం పంచాయతీ కార్యాలయాల వద్ద గంటల కొద్దీ నిరీక్షించాల్సి వచ్చేదని, ఇప్పుడు ఒకటో తేదీనే అందుతోందని లబ్ధిదారులు గుర్తుచేసుకుంటూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పనితీరును ప్రశంసించారు.

– సాక్షి నెట్‌వర్క్

తల్లిపాలే శిశువుకు శ్రీరామరక్ష


గుమ్మలక్ష్మీపురం: గర్భిణులకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తున్న డీపీహెచ్ఎన్ఓ కె.ఉషారాణి

గుమ్మలక్ష్మీపురం: తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని డీపీహెచ్ఎన్ఓ (జిల్లా పబ్లిక్ హెల్త్ నర్సెస్ ఆఫీసర్) కె.ఉషారాణి అన్నారు. మండల కేంద్రంలోని వైటీసీలో తల్లిపాల వారోత్సవాలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గిరిశిఖర గ్రామాల గర్భిణుల వసతి గృహాన్ని ఆమె సందర్శించారు. తల్లిపాల ప్రాముఖ్యతను గర్భిణులకు వివరించారు. బిడ్డ పుట్టిన గంటలోపు తల్లి పాలు తప్పకుండా పట్టాలని, ఆ పాలలో బిడ్డ ఎదుగుదలకు కావాల్సిన అన్ని రకాల పోషకాలు పుష్కలంగా ఉంటాయని అన్నారు. బిడ్డకు ఆరు మాసాలు వచ్చే వరకు తల్లిపాలు పట్టాలని సూచించారు. అలాగే మొదటి సంతానానికి రెండో సంతానానికి మధ్య కనీసం రెండేళ్ల ఎడం పాటించాలని, ఇలా చేయడం తల్లీబిడ్డ ఆరోగ్యానికి మంచిదన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగించుకోవాలని సూచించారు. ఆమె వెంట హెల్త్ ఎడ్యుకేటర్స్ జి.విజయలక్ష్మి, కె.ఆదిలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ జె.తిరుపతిరావు, వైటీసీ మేనేజర్ రాము ఉన్నారు.

• పాలకొండ: తల్లిపాలే బిడ్డకు సంపూర్ణ రక్షణ అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని కొండాపురం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే తల్లిపాలకు మించిన పౌష్టికాహారం లేదన్నారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా పిల్లలకు కావాల్సిన పాలు అందుతాయని వివరించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం కుమారి, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

• పాలకొండ రూరల్: స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని నాగవంశంవీధిలో మంగళవారం తల్లిపాల విశిష్టతను వివరిస్తూ ఆరోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని, పిల్లలకు ఆరు నెలల వయసు వచ్చేవరకు తల్లిపాలను తప్పకుండా పట్టాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మేరీ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


పాలకొండ రూరల్: ర్యాలీలో పాల్గొన్న తల్లులు, గర్భిణులు


పాలకొండ: తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన ర్యాలీ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

గిరిజన గురుకులాల్లో సీట్లు పెంపుపై హర్షం


విశ్వాసరాయి కళావతి, పాలకొండ ఎమ్మెల్యే

సీతంపేట: గిరిజన గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థుల ప్రవేశాలకు సీట్లు పెంచడంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, గిరిజన సంక్షేమశాఖ మంత్రి రాజన్నదొరకు ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గిరిజన గురుకులాల్లో సీట్లు పెంచాలని విద్యార్థుల తల్లిదండ్రుల కోరికను తాను ఐటీడీఏ పీఓ, రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని, దీనిపై ప్రభుత్వం, గిరిజన సంక్షేమశాఖ వెంటనే స్పందించి సీట్లు పెంచడం జరిగిందన్నారు. సీతంపేట, పాచిపెంట మినీ గురుకులాల్లో 7వ తరగతి పూర్తి చేసిన బాలికలను సీతంపేట బాలికల గురుకుల పాఠశాల, కురుపాం యూఆర్‌జేసీలో 45 సీట్లు చొప్పున పెంచినట్లు చెప్పారు. ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ బాలికల గురుకుల జూనియర్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, అకౌంటింగ్ అండ్ ట్యాక్సేషన్ గ్రూపులో 10 సీట్లు చొప్పున మొత్తం 40 సీట్లు అదనంగా పెంచినట్లు వెల్లడించారు. గిరిజన గురుకుల బాలుర జూనియర్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ గ్రూపుల్లో 10 చొప్పున మొత్తం 30 సీట్లు పెంచడంతో పాటు విద్యార్థులకు ప్రవేశాలు కూడా కల్పించడం జరిగిందని పేర్కొన్నారు.

మన్యం బంద్‌కు ప్రజలు సహకరించాలి

కురుపాం: మణిపూర్‌లో ఆదివాసీలపై జరుగుతున్న దమనకాండకు నిరసనగా ఆదివాసీ సంఘాల పిలుపుమేరకు ఈ నెల 3న మన్యం బంద్‌కు ప్రజలు సహకరించాలని ఆదివాసీ హక్కుల పరిరక్షణ వేదిక గౌరవ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కోలక లక్ష్మణమూర్తి పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ.. గత నాలుగు నెలలుగా మణిపూర్‌లో హింసాత్మక ఘటనలు జరుగుతున్నా అక్కడ అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం శాంతి భద్రతలను కాపాడాల్సింది పోయి చోద్యం చూస్తోందని మండిపడ్డారు. ఆదివాసీ మహిళలపై జరుగుతున్న దాడులకు నిరసనగా ఈ నెల 3న చేపట్టే మన్యం బంద్‌లో ప్రజలంతా పాల్గొని మద్దతు తెలపాలని కోరారు.

మారుమూల గ్రామాల్లో ఆధార్ సేవలందించాలి


కిట్లు పంపిణీ చేస్తున్న ఏపీఓ రోసిరెడ్డి

సీతంపేట: మారుమూల గిరిజన గ్రామాలకు ఆధార్ సేవలు అందించాలని ఐటీడీఏ ఏపీఓ రోసిరెడ్డి అన్నారు. బ్లూ 3 ఐటీ సొల్యూషన్స్, విద్యాశాఖ కొత్తగా మంజూరు చేసిన 5 ఆధార్ మొబైల్ కిట్లను స్థానిక వైటీసీలో మంగళవారం ఆపరేటర్లకు అందజేశారు. గిరిజనులకు ఆధార్ సేవలపై అవగాహన కల్పించి వారికి అవసరమైన సేవలను అందించాలని సూచించారు. కార్యక్రమంలో బ్లూ3 ఐటీ సొల్యూషన్ ప్రతినిధులు కమాలకర్, డేవిడ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జంతువుల పట్ల మానవత్వం కలిగి ఉండాలి

• సబ్‌కలెక్టర్ నూరల్ కమర్


సామవేశంలో అధికారులకు సూచనలు చేస్తున్న సబ్‌కలెక్టర్ నూరల్‌కమర్

పాలకొండ రూరల్: జంతువుల పట్ల ప్రతి ఒక్కరూ మానవత్వం కలిగి ఉండాలని సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్ అన్నారు. జంతు పరిరక్షణ చట్టం అమలు తీరుపై సంబంధిత అధికారులతో మంగళవారం తన కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూగజీవాల అక్రమ రవాణా చట్ట విరుద్ధమని, ఈ తరహా చర్యలకు పాల్పడే వారిపట్ల కఠినంగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. మండల స్థాయిలో తహసీల్దార్ అధ్యక్షతన జంతు పరిరక్షణ కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. జంతు బలులు చేపట్టకుండా నోటీసు బోర్డులు ప్రదర్శించాలన్నారు. అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న మంస విక్రయ కేంద్రాలను గుర్తించి వాటిని మూసివేయాలని ఆదేశించారు. పిల్లల్లో జంతువుల పట్ల ప్రేమ కలిగే విధంగా పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో పశుసంవర్ధకశాఖ ఏడీ పి.మాణిక్యరావు, వైద్యులు బి.సిద్దార్థ, డీఎల్‌పీఓ జె.రాంప్రసాద్, నగరపంచాయతీ కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు, ఎస్సై బి.శివప్రసాద్ తదితరులున్నారు.

10 లీటర్ల సారా పట్టివేత

వీరఘట్టం: మండలంలోని హుస్సేనుపురం వద్ద నిమ్మకాయల ప్రసాద్ అనే వ్యక్తి సారా తరలిస్తుండగా మంగళవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.వి.రమణ తెలిపారు. సారా తయారీ, విక్రయించే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

బడి బయట పిల్లల గుర్తింపు

సీతంపేట: మండలంలో బడిబయట ఉన్న ఇద్దరు బాలికలను గుర్తించి బడిలో చేర్పించినట్లు పీఎంఆర్‌సీ సీఎంఓ పొట్నూరు కోటిబాబు, జీసీడీఓ రాములమ్మ తెలిపారు. మండలంలోని శిలిగాం గ్రామంలో ఇద్దరు పిల్లలు ఐదో తరగతి వరకు చదివి బడి మానేసినట్లు గుర్తించి మంగళవారం వారి ఇంటికి వెళ్లారు. వారి తల్లిదండ్రులతో మాట్లాడి విద్యార్థులను ముత్యాలు గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఆరో తరగతిలో చేర్పించినట్లు చెప్పారు.

డ్రైనేజీ నిర్మాణానికి ప్రతిపాదనలు


నడుకూరు వద్ద ప్రధాన రహదారిలో డ్రైనేజీ నిర్మాణానికి కొలతలు వేస్తున్న ఆర్అండ్‌బీ సిబ్బంది

వీరఘట్టం: మండలంలోని నడుకూరు ప్రధాన రహదారిలో రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ నిర్మాణానికి ఆర్ అండ్‌బీ అధికారులు ప్రతిపాదనలు చేపట్టారు. స్థానిక పెట్రోల్ బంక్ నుంచి కిమ్మి రోడ్డు టర్నింగ్ వరకు 200 మీటర్లు పొడువున రోడ్డుకు ఇరువైపులా కాంక్రీట్ కాలువల నిర్మాణం చేపట్టేందుకు ఆర్అండ్‌బీ అధికారులు మంగళవారం కొలతలు వేశారు. ప్రధాన రహదారిలో కాలువలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఇటీవల గ్రామ సర్పంచ్ కర్రి రమాదేవి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కర్రి లీలాప్రసాదరావు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో స్పందించిన ఆర్ అండ్‌బీ అధికారులు ప్రధాన రహదారిలో 50 అడుగుల రహదారిని వదిలేసి ఇరువైపులా రూ.50 లక్షలతో డ్రైనేజీ నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపించారు.

కొండవాగు ఆయకట్టుకు నీరందించండి


వరదకాలువలో నుంచి పైపుల ద్వారా నీటి తరలింపు

భామిని: మండలంలో కొండవాగు గెడ్డ ఆయకట్టు పరిధిలో ఉన్న పంటలకు నీరు అందక రైతులు నష్టపోతున్నారని వైఎస్సార్‌సీపీ నాయకుడు, నీటి సంఘం చైర్మన్ రొక్కం రామారావు అన్నారు. వంశధార ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన వరద కాలువతో కొండవాగు గెడ్డ కింద ఉన్న ఐదు గొలుసుకట్టు చెరువులకు నీరు చేరని పరిస్థితి నెలకొందన్నారు. దీంతో సుమారు 400 ఎకరాలకు సాగునీరు అందక రైతులు నష్టపోతున్నారని వాపోయారు. కొండవాగు గెడ్డ నుంచి రైతులు ఇంజిన్ల సాయంతో నీరు తరలించాల్సి వస్తోందని అన్నారు. వరద కాలువపై గెడ్డ నీరు తరలించేందుకు వీలుగా ద్రోణి నిర్మించాలని ప్రాజెక్టు అధికారులకు పలుమార్లు కోరినా వారి నుంచి సరైన స్పందన లేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రైతులకు సాగునీటి ఇబ్బందులు తొలగించాలని కోరారు.

నమూనా పంటల పరిశీలన

పార్వతీపురంటౌన్: మండలంలోని పెద్ద బొండపల్లి, పుట్టూరు గ్రామాల్లో రైతుల ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ సాగు ద్వారా ఒకే చోట సాగు చేపట్టిన కూరగాయల నమూనా పంటలను డీపీఎం షణ్ముఖ రాజు మంగళవారం పరిశీలించారు. రైతులు ఒకే ప్లాట్‌లో 10 నుంచి 14 రకాల కాయగూరలు ఆకుకూరలు, దుంప జాతి సాగు ద్వారా మంచి ఆహార పదార్థాలు లభిస్తాయని ఈ సందర్భంగా ఆయన అన్నారు. దీనినే ఏటీఎం మోడల్‌గా పిలుస్తున్నట్లు తెలిపారు. 15 సెంట్ల భూమిలో పలు పంటల వల్ల రోజుకు రూ.300 నుంచి రూ.500 వరకు ఆదాయం వస్తున్నట్లు రైతులే చెబుతున్నారన్నారు. ప్రతి రైతు ఈ విధంగా ఏటీఎం మోడల్ వేసుకుంటే రోజూ ఆదాయం పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సాగు రైతులు పాల్గొన్నారు.

నగరపంచాయతీ కార్యాలయం ముట్టడి


ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

పాలకొండ: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నగరపంచాయతీలో పనిచేస్తున్న కార్మికులు మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించారు. కార్యాలయం గేటు ముందు బైఠాయించి సిబ్బందిని లోపలకు వెల్లనీయకుండా అడ్డుకున్నారు. దీంతో పోలీసులు అక్కడకు చేరుకుని కార్మికులను అదుపులోనికి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. 58 మందిపై కేసు నమోదు చేసి సొంత పూచికత్తుపై పంపించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల రాష్ట్ర వ్యాప్త ఆందోళన కార్యక్రమంలో భాగంగా ఇక్కడ నిరసన తెలియజేసినట్లు చెప్పారు. కార్మికులను రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం అందించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పడాల భాస్కరరావు, చింతల సంజీవి, కాద రాము, పడాల వేణు, చింతల సురేష్, రఘు, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

తోటపల్లి దేవస్థానం కార్యవర్గ సభ్యునికి సత్కారం


పాత్రోను సన్మానిస్తున్న ఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణ

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి గ్రామానికి చెందిన గౌరీశంకర పాత్రోకు తోటపల్లి దేవస్థానం కార్యవర్గంలో చోటు కల్పించడంతో ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణ, ఎస్సై షణ్ముఖరావు, ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ యుగంధర్, తదితరులు మంగళవారం ఆయన్ని సత్కరించారు. ఈ సందర్భంగా తనకు కార్యవర్గంలో చోటు కల్పించినందుకు ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజుకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

తూనిక యంత్రం ఏర్పాటు


మొక్కలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ ఉరిటి రామారావు

గరుగుబిల్లి: రైతులకు అందుబాటులో ఏర్పాటు చేసిన తూనిక యంత్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉద్యాన శాఖాధికారి కె.సత్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని సుంకి గ్రామ సమీపంలో లక్ష్మీబాలాజీ ఆయిల్స్ ఆధ్వర్యంలో పామాయిల్ గెలల సేకరణ, తూనిక కేంద్రం వద్ద మంగళవారం ఆయిల్ పామ్ ప్లాంటేషన్ మేళాను నిర్వహించారు. పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలోని కురుపాం, కొమరాడ, జియ్యమ్మవలస, పార్వతీపురం, గరుగుబిల్లి, బలిజిపేట మండలాల్లో 125 హెక్టార్లలో 20వేలు ఆయిల్ పామ్ మొక్కలను పంపిణీ చేసినట్లు చెప్పారు. అనంతరం తూనిక కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉరిటి రామారావు, నాయకులు ద్వారపురెడ్డి ధనుంజయరావు, డి.సత్యనారాయణ, మేనేజింగ్ డైరెక్టర్ ఎం.సతీస్‌రాయ్, పలువురు రైతులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన


భోజనాలు ఎలా ఉన్నాయని విద్యార్థులను అడిగి తెలుసుకుంటున్న ఎంపీడీఓ చందరరావు

భామిని: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు పెడుతున్న మధ్యాహ్న భోజనాన్ని ఎంపీడీఓ జి.చంద్రరావు మంగళవారం పరిశీలించారు. భోజనాలు ఎలా ఉంటున్నాయి, మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వంటలు రుచిగా ఉండాలని, మెనూ కచ్చితంగా అమలు చేయాలని వంట ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు.

ఐటీఐలో ప్రవేశాలకు కౌన్సెలింగ్ రేపు

సీతంపేట: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో మిగులు సీట్లలో ప్రవేశాలకు గురువారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.గోపాలకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాలకు 7569062449, 9948582309 కు ఫోన్ చేయాలని కోరారు.